ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

వైద్యారోగ్యశాఖలో డెంటల్ అసిస్టెంట్ సర్జన్, స్పీచ్ పాథాలజిస్ట్ పోస్టుల భర్తీ కోసంమరో 2 జాబ్ నోటిఫికేషన్లను మెడికల్ అండ్ హెల్త్ సర్వీసెస్ రిక్రూట్‌మెంట్ బోర్డు గురువారం విడుదల చేసింది. స్పీచ్ పాథాలజిస్ట్ పోస్టులకు జూలై 12 నుంచి 26 వరకు, డెంటల్ అసిస్టెంట్ సర్జన్స్‌కు జూలై 14 నుంచి 25 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు. డెంటల్ అసిస్టెంట్ సర్జన్ పోస్టులు 48 ఉండగా, స్పీచ్ పాథాలజిస్ట్ పోస్టులు 4 ఉన్నాయి. ప్రభుత్వ ఆస్పత్రుల్లో గడిచిన 17 నెలల్లో 8 వేలకుపైగా పోస్టులను ప్రభుత్వం భర్తీ చేసింది. మరో 6 వేలకుపైగా పోస్టులకు భర్తీ ప్రక్రియ కొనసాగుతున్నది. పోస్టుల వివరాలు, విద్యార్హతలు, ఇతర వివరాలను బోర్డు వెబ్‌సైట్‌లో (https:// mhsrb.telangana.gov.in /MHSRB/home.htm) అందుబాటులో ఉంచినట్టు అధికారులు తెలిపారు. గత 18 నెలల కాలంలో ప్రభుత్వ దవాఖాన్లలో 8 వేలకుపైగా పోస్టులను ప్రభుత్వం భర్తీ చేసిన సంగతి తెలిసిందే. ఇందులో డాక్టర్స్, స్టాఫ్ నర్స్, డ్రగ్ ఇన్‌స్పెక్టర్స్, ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్స్ తదితర పోస్టులు ఉన్నాయి. మరో 6 వేలకుపైగా పోస్టుల భర్తీ ప్రక్రియ కొనసాగుతోంది. ఇందులో ల్యాబ్ టెక్నీషియన్ 1,284, మల్టీ పర్పస్ ఫీమేల్ హెల్త్ అసిస్టెంట్ 1,930, ఫార్మసిస్ట్ 732, నర్సింగ్ ఆఫీసర్(స్టాఫ్ నర్స్) 2,322 తదితర పోస్టులున్నాయి. త్వరలో మెడికల్ కాలేజీల్లో అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులకు నోటిఫికేషన్ విడుదల కానుంది.

నీటిపారుదల శాఖ ఇఎన్‌సి అడ్మిన్‌గా శంకర్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తెలంగాణ నీటిపారుదల శాఖలో పలు నియామకాలు చోటుచేసుకున్నాయి. ఈమేరకు గురువారం సర్కారు ఆదేశాలు జారీచేసింది. నీటిపారుదల శాఖ ఇఎన్‌సి అడ్మిన్‌గా బి శంకర్ నియమితులయ్యారు. ఇక్కడ ఇన్‌ఛార్జ్‌గా ఉన్న ఇఎన్‌సి జనరల్ మహ్మద్ అమ్జద్ హుస్సేన్ రిలీవ్ చేస్తూ ముఖ్యకార్యదర్శి రాహుల్ బొజ్జా ఉత్తర్వులు జారీచేశారు. అలాగే హైదరాబాద్ చీఫ్ ఇంజినీర్‌గా మహ్మద్ మొయిజు ద్దీన్ సాజిద్‌ను నియమించారు. అలాగే సచివాలయంలో కార్యదర్శి కార్యాలయంలో డిఇగా ఎంవి మహేశ్వర్‌రెడ్డికి పోస్టింగ్ ఇచ్చారు. ఈ మూడు నియామకాలకు వేర్వేరుగా ఉత్తర్వులిచ్చారు.

**FORM-4
(PROCLAMATION REQUIRING THE APPEARANCE OF PERSON ACCUSED)
IN THE COURT OF THE XXI ADDL. SMALL CAUSES JUDGE AND ACJM (SCCH-23) AT BENGALURU
C.C. No. 2626/2019**

M/S RALLIS INDIA LIMITED, PLOT NO.3, KIADB, 4TH PHASE, BOMMASANDRA, BENGALURU-560 099. ...
COMPLAINANT

-V/s-

M/s. SRI PARAMESHWARA SEEDS, AND PESTICIDES ... **ACCUSED**

PROCLAMATION REQUIRING THE APPEARANCE OF PERSON ACCUSED

1. M/s. SRI PARAMESHWARA SEEDS AND PESTICIDES, H.No-29-68/1, MOOSA COMPLEX, NETAJI CHOWK, JEDCHERA, MEHABOOBNAGAR, TELANGANA -509 301

2. MR. KAVALI VENKATAIAH, PARTNER M/s. SRI PARAMESHWARA SEEDS AND PESTICIDES, H.No-29-68/1, MOOSA COMPLEX, NETAJI CHOWK, JEDCHERA, MEHABOOBNAGAR, TELANGANA - 509 301

3. MR.MALLEPALLY MAHESHWAR REDDY, PARTNER M/s. SRI PARAMESHWARA SEEDS AND PESTICIDES, H.No-29-68/1, MOOSA COMPLEX, NETAJI CHOWK, JEDCHERA, MEHABOOBNAGAR, TELANGANA-509 301 ... **ACCUSED**

WHEREAS, the Complainant has been made before me that, the Accused have committed (or suspected to have committed) the offense of punishable u/s 138 of the Negotiable Instruments Act, that it has been returned to a warrant of arrest thereupon issued that the above mentioned Accused cannot be found and whereas it has been shown to my satisfaction that the above mentioned Accused have absconded (or is concealing himself to avoid the service of the said warrant).

Proclamation is hereby made that the above mentioned Accused are required to my appear at **11:00 A.M** before this Court (or before me) answer the said complaint on **28/07/2025**

Given under my hand and seal of the court on this 16/06/2025

By order of the Court, XXI Addl. Judge, Court of Small Causes and ACJM Bengaluru City

ప్రకటన

**మహారాజశ్రీ పశ్చిమ గోదావరి జిల్లా ప్రిన్సిపల్ జిల్లా కోర్టు
ఐ.ఎ.నెం. 1632/2023
ఎ.ఎస్.నెం. 29/2023**

బిట్వీన్:-
శ్రీమతి దారపురెడ్డి గంగాతులసి
సుగుణమణి వగైరా ...పిటిషనర్లు/అప్పిలెంటు

మరియు

శ్రీమతి పొన్నూరి కృష్ణవేణి వగైరా
...రెస్పాండెంట్లు/రెస్పాండెంట్లు

పై నెంబరు గ్రంథంలో అప్పీలులో శ్రీ మధ్యాహ్నపు సుబ్బారాయుడు గారు చనిపోయినందున వారి వారసులను అప్పీలు గ్రంథములో రెస్పాండెంట్లుగా చేర్చుటకు పై నెంబరు పిటీషను దాఖలు చేసినారు. సదరు పిటీషనులో **7వ రెస్పాండెంట్:** శ్రీ చంచులపు ప్రసాద్, తండ్రి: శ్రీ రాధాకృష్ణ, విశాఖపట్టణం.

మరియు

10వ రెస్పాండెంట్: శ్రీమతి చంచులపు సూర్యలక్ష్మి, భర్త: గంగాధర్, హైదరాబాద్.

వారికి నోటీసు నిమిత్తము **ది.31-07-2025 వ తేదీకి** వాయిదా కాబట్టి సదరు పై కోర్టు వారి ఎదుట, సదరు తేదీని **ఉదయం గం. 10-30 ని॥లకు** స్వయంగా గానీ, ప్లీడరు గారి ద్వారా గాని హాజరై వారికి గల ఆక్షేపణలు తెలుపుకోవలెను. లేని యెడల వారి పరోక్షమును పిటీషను పరిష్కరించబడును.

(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)

ఎస్.వి.ఆర్. గాంధీ
ఏలూరు అప్పిలెంట్ల తరపున న్యాయవాది
తేది:24-06-2025

ఇద్దరు నకిలీ మందుల డీలర్లు అరెస్ట్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

నకిలీ మందులను సరఫరా చేస్తున్న ఇద్దరు డీలర్లను డ్రగ్ కంట్రోల్ అధికారులు అరెస్ట్ చేశారు. విశ్వసనీయ సమాచారం మేరకు అధికారులు హైదరాబాద్ కోఠి సుల్తాన్‌బజార్‌లోని గుజరాత్ గల్లీలో, ఇందర్‌బాగ్‌లో గంగ ఫార్మా డిస్ట్రిబ్యూటర్స్, శ్రీ నందిని ఫార్మాల్లో తనిఖీలు నిర్వహించారు. సన్ ఫార్మాస్యూటికల్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ తయారు చేస్తున్న మందులకు సంబంధించి వీరు నకిలీవి పంపిణీ చేస్తున్నట్టు గుర్తించారు. దీంతో డీలర్లు ప్రవీణ్ కుమార్ కనోడియా (గంగ ఫార్మా డిస్ట్రిబ్యూటర్స్), మితింటి శ్రీనివాస్ (శ్రీ నందిని ఫార్మా)లను అరెస్ట్ కేసులు నమోదు చేశారు. వీరిద్దరని నాంపల్లిలోని 2వ అడిషనల్ చీఫ్ జుడిషియల్ మెజిస్ట్రేట్ కోర్టు ముందు హాజరు పరచగా, వారిద్దరికి 14 రోజుల జుడిషియల్ రిమాండ్ విధించింది. ఇద్దరిని చంచల్ గూడా జైలుకు తరలించారు.

44 శాతం మందిలో చిగుళ్ల సమస్యలు

- కోల్గెట్ నివేదిక వెల్లడి

హైదరాబాద్ : ప్రజల్లో 41 శాతం మంది కావిటీస్ ప్రమాదాన్ని, 44 శాతం మంది చిగుళ్ల సమస్యలు, 14 శాతం మంది దంతాలపై మరకలతో ఇబ్బంది పడుతున్నారని కోల్గెట్ నివేదిక వెల్లడయ్యింది. దేశ వ్యాప్తంగా నిర్వహించిన ఓరల్ హెల్త్‌లో సమాచారాన్ని సేకరించినట్లు పేర్కొంది. 72 శాతం మంది ఏదో ఒక నోటి ఆరోగ్య సమస్యను ఎదుర్కొంటున్నారని పేర్కొంది. దంత వైద్య పరీక్షలు చేయించుకున్న 45 లక్షల మందిలో 10 శాతం మంది మాత్రమే 5/5 దంత ఆరోగ్య స్కోరును పొందారని పేర్కొంది. ఓరల్ హెల్త్ స్కోర్‌ను 5కి 2.6గా వెల్లడించింది.

కూలిన సినిమా హాల్ సీలింగ్

- ఒకరికి గాయాలు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

మహబూబాబాద్ జిల్లాలోని ముకుంద సినిమా థియేటర్‌లో బుధవారం రాత్రి సెకండ్ షో కుబేర సినిమా నడుస్తుండగా ఒక్కసారిగా పై సీలింగ్ కొంత భాగం కూలి పడింది. ఈ ఘటనతో ప్రేక్షకులు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. సినిమా చివరికి వచ్చిన క్రమంలో సుమారు పదకొండున్నర గంటలకు ఈ ఘటన జరిగింది. ఒకరికి స్వల్పంగా గాయాలు కాగా వెంటనే మానుకోట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనతో సినిమా ను నిలిపివేశారు. కాగా, ప్రేక్షకులకు, సినిమా థియేటర్ నిర్వాహకులకు వాగ్వాదం జరిగింది. పోలీసులు వచ్చి సర్ది చెప్పి ప్రేక్షకులను పంపిం చేశారు. సినిమా హాల్‌లో ప్రేక్షకులు ఎక్కువ సంఖ్యలో లేకపోవడంతో భారీ ప్రమాదం తప్పింది.

లేబర్ కోడ్‌లు రాకముందే దాడి తీవ్రతరం

- జమ్మూ కాశ్మీర్‌లో 420 కార్మిక సంఘాల రద్దు
- పది గంటల పనివిధానానికి తెలంగాణ క్యాబినెట్ ఆమోదం
- జులై 9న సార్వత్రిక సమ్మె : హేమలత



సమావేశంలో మాట్లాడుతున్న హేమలత

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

లేబర్ కోడ్‌లు రాకముందే దేశవ్యాప్తంగానూ కార్మికవర్గంపై దాడి తీవ్రమైందని సిఐటియు జాతీయ అధ్యక్షులు డాక్టర్ కె హేమలత చెప్పారు. ఇప్పటికే జమ్మూ కాశ్మీర్‌లో 420 కార్మిక సంఘాలను రద్దు చేయాలని, పది గంటల పనివిధానాన్ని ఆమోదం తెలుపుతూ ఇటీవలే తెలంగాణ కేబినెట్ నిర్ణయించిందని, కర్ణాటకలోనూ కోడ్‌లను అమలు చేస్తామని ఆ రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిందని వివరించారు. లేబర్ కోడ్‌లు అమలోకి వస్తే కార్మికులు కట్టుబానిసలుగా మారే ప్రమాదముందని ఆందోళన వ్యక్తం చేశారు. కార్పొరేట్లకు కార్మిక వర్గాన్ని బలిచ్చేందుకు తీసుకురాబోతున్న నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ జులై 9న జరిగే సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. గురువారం హైదరాబాద్‌లోని సిఐటియు రాష్ట్ర కార్యాలయంలో ఆ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు చుక్క రాములు అధ్యక్షతన ఆఫీస్ బేరర్ల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పహల్గామ్‌లో ఉగ్రవాదుల దాడుల నేపథ్యంలో కార్మివర్గం ఓవైపు సమ్మెను వాయిదా వేస్తే...మరోవైపు కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం మాత్రం లేబర్ కోడ్‌లను అమలును ముందుకు తీసుకెళ్తున్నదని చెప్పారు. కర్నాటక, జమ్మూకాశ్మీర్, తెలంగాణ, తదితర రాష్ట్రాల్లో జరుగుతున్న పరిణామాలను వివరించారు. రాత్రి విధుల్లో మహిళలు పనిచేయాలని నిర్ణయించడం దుర్మార్గమన్నారు. కోడ్‌ల సాకుతో కార్మిక సంఘాల రిజిస్ట్రేషన్‌ను కఠినతరం చేయడం, కార్మిక సంఘాలను రద్దు చేయడం దారుణమన్నారు. కార్మిక శాఖను పూర్తిగా ఫెసిలిటేట్ (మధ్యవర్తిత్వ శాఖ) విభాగంగా మార్చడం, ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ పేరుతో కార్మిక హక్కులను నిర్వీర్యం చేయడం, కార్మిక చట్టాలను సరళతరం చేయడం, కార్మిక సంఘాలు లేని భారత దేశాన్ని పెట్టుబడిదారులు, కార్పొరేట్ శక్తులకు బహుమానంగా ఇవ్వడం మోడీ సర్కారు లక్ష్యంగా కనిపిస్తోందన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో దశాబ్ధాల పాటు కార్మికవర్గం పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలను, హక్కులను, భారత రాజ్యాంగాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత కార్మికవర్గంపై ఉందని నొక్కి చెప్పారు. ప్రజల ఆస్తులను కార్పొరేట్లకు దోచిపెడ్తూ, మతోన్మాద చర్యల ద్వారా కార్మికవర్గ ఐక్యతకు విచ్ఛిన్నం చేసే చర్యలను ప్రతిఘటించాలని పిలుపునిచ్చారు. జులై 9 సమ్మెను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో సిఐటియు జాతీయ కోశాధికారి ఎం సాయిబాబు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్, ఆఫీస్ బేరర్లు ఎస్ వీరయ్య, భూపాల్, జె వెంకటేష్, ఎస్ రమ, పి జయలక్ష్మీ, వంగూరు రాములు, ఎం పద్మశ్రీ, వివిఎస్ రావు, ఎ.ముత్యంరావు, రాగుల రమేష్, కల్యాణం వెంకటేశ్వర రావు, టి వీరారెడ్డి, టి రాజారెడ్డి, బి మల్లేష్, కూరపాటి రమేష్, పి శ్రీకాంత్, కాసు మాధవి, కె గోపాలస్వామి, ఎజె రమేష్, ఎం వెంకటేష్, బి మధు, జె చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

స్మార్ట్‌ఫోన్ టెండర్లలో పారదర్శకతకు పాతర..!

- ఓ మొబైల్ కంపెనీకి అనుకూలంగా ఐసిడిఎస్ నిర్ణయం
- ఇతర కంపెనీల ఆందోళన

ప్రజాశక్తి - హైదరాబాద్

అంగన్‌వాడీ సూపర్‌వైజర్లకు స్మార్ట్‌ఫోన్లు అందించేందుకు ప్రభుత్వం పిలిచిన టెండర్లలో పారదర్శకత పూర్తిగా లోపించినట్లు తెలుస్తోంది. మహిళా శిశు సంక్షేమశాఖ ఆధ్వర్యంలో టెండర్ల ప్రక్రియలో అవకతవకలు జరిగాయని ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ వ్యవహారంలో ప్రభుత్వంలోని కొందరు ముఖ్యనేతలు, అధికారులు చక్రం తిప్పారు. కేంద్ర ప్రభుత్వం అంగన్‌వాడీ సూపర్‌వైజర్లకు స్మార్ట్‌ఫోన్లు అందజేయాలని నిర్ణయించింది. టెండర్లు పిలిచి సెల్‌ఫోన్లను సమకూర్చుకోవాలని రాష్ట్ర ప్రభుత్వాలను ఆదేశించింది. ఈ టెండర్‌ల కోసం రూపొందించిన మార్గదర్శకాల్లో కనీస పారదర్శకత పాటించలేదని ఇతర మొబైల్ కంపెనీలు గగ్గోలు పెడుతున్నాయి. తెలంగాణలో 38,117 సెల్‌ఫోన్‌లు సమకూర్చుకోవాలని మహిళాశిశు సంక్షేమశాఖ నిర్ణయించగా.. ఈ నెల 12న నోటిఫికేషన్ జారీ చేసి, 23వ తేదీ వరకు గడువు విధించింది. కాగా.. ఒక కంపెనీకి చెందిన మోడల్‌ను ముందే ఖరారు చేయడం గమనార్హం. ప్రీబిడ్ సమావేశం నిర్వహించకుండా, టెండర్ల ప్రక్రియ ముగియకుండా ఓ కంపెనీకి అనుకూలంగా నిర్ణయం తీసుకోవడం ఏమిటనీ ఇతర మొబైల్ తయారీ కంపెనీలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి.

గుండెపోటుతో ప్రభుత్వ ఉపాధ్యాయుడు మృతి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

టిఎస్ యుటిఎఫ్ మండల మాజీ కార్యదర్శి, ప్రభుత్వ ఉపాధ్యాయుడు సోమవరపు నరసింహారావు (56) బుధవారం రాత్రి గుండెపోటుతో మధిర టీచర్స్ కాలనీలో మృతి చెందారు. ఆయనకు భార్య, ఇద్దరు పిల్లలున్నారు. నరసింహారావుకి మృదుస్వభావిగా, మితభాషిగా పేరుంది. గతంలో టీఎస్ యూటీఎఫ్ మాజీ మండల కార్యదర్శిగా పనిచేశారు.


నిరసన తెలుపుతున్న ఫార్మా బాధిత రైతులు

హైకోర్టు ఆర్డర్‌ను గౌరవించాలి

- ఫార్మా బాధిత రైతుల డిమాండ్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఫార్మా భూముల విషయంలో రాష్ట్ర ప్రభుత్వం వెంటనే హైకోర్టు ఇచ్చిన ఆర్డర్‌ను గౌరవించి రైతుల సమస్యలను పరిష్కరించాలని ఫార్మాసిటీ వ్యతిరేక పోరాట కమిటీ డిమాండ్ చేసింది. గురువారం రంగారెడ్డి జిల్లా యాచారం మండలం మేడిపల్లిలో ఫార్మాసిటీ పరిధిలోని నాలుగు గ్రామాల రైతులతో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. నిషేధిత జాబితాలో ఉన్న పట్టా భూములను ఆన్‌లైన్‌కి ఎక్కించాలని ప్రభుత్వాన్ని కోరారు. నిషేధిత జాబితా నుంచి భూములను తొలగించాలని రైతులు డిమాండ్ చేశారు. రైతు భరోసా మొత్తాన్ని రైతు ఖాతాల్లో జమ చేయాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల హామీలో భాగంగా రైతులకు ఇచ్చిన మాటను నిలబెట్టుకోవాలన్నారు. గత ప్రభుత్వం మాదిరే కాంగ్రెస్ ప్రభుత్వం కూడా వ్యవహరిస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతులను మోసం చేసే విధంగా సిఎం రేవంత్‌రెడ్డి పాలన ఉందని, ప్రభుత్వం స్పందించకుంటే రైతులతో సమావేశమై కార్యాచరణను రూపొందిస్తామని హెచ్చరించారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం రైతులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలన్నారు. ఈ సమావేశంలో ఫార్మాసిటీ వ్యతిరేక పోరాట కమిటీ సభ్యులు, రైతులు పాల్గొన్నారు.

ఫోన్ ట్యాపింగ్ కేసు సిబిఐకి అప్పగించాలి

- కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి


'ఎమర్జెన్సీ ఎగ్జిబిషన్'ను పరిశీలిస్తున్న కిషన్‌రెడ్డి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

'ప్రతిపక్షంలో ఉన్న సమయంలో రేవంత్‌రెడ్డి ఫోన్ ట్యాపింగ్‌పై సిబిఐ దర్యాప్తు చేయాలని డిమాండ్ చేశారు. ఇప్పుడు అధికారంలోకి వచ్చాక పోలీస్‌శాఖతోనే దర్యాప్తు చేయిస్తున్నారు. ఫోన్ ట్యాపింగ్ చేసిన పోలీస్ వ్యవస్థపై.. పోలీసుల దర్యాప్తు వల్ల న్యాయం జరిగే అవకాశం ఉందా..? ఫోన్ ట్యాపింగ్ కేసు సీబీఐకి అప్పగించాలి' అని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. గురువారం నిజామాబాద్ జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన 'ఎమర్జెన్సీ ఎగ్జిబిషన్'ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఫోన్ ట్యాపింగ్ వ్యవహారం దేశంలో ఎక్కడ ఇలా జరగలేదని.. ఇద్దరు వ్యక్తుల సంభాషణను వింటూ వాక్ స్వాతంత్రం హక్కును కాలరాశారని అన్నారు. బాత్‌రూం, బెడ్ రూంలలోకి తొంగిచూసినంత పని చేశారని.. రాజకీయ నాయకులను, సినిమా నటీనటులను, వ్యాపారులను, మీడియా అధినేతల, విలేకరులవి ఆఖరికి న్యాయమూర్తుల ఫోన్‌లు సైతం ట్యాపింగ్ చేసినట్టు తెలిపారు. చిత్తశుద్ధి ఉంటే బిఆర్ఎస్-కాంగ్రెస్ కుమ్మక్కు కాలేదని నిరూపించేందుకు ఈ కేసును సిబిఐకి అప్పగించాలని డిమాండ్ చేశారు. ప్రత్యేక కార్యాచరణతో పసుపు ఉత్పత్తిని పెంచి రైతులకు మేలు జరిగేవిధంగా చూస్తామని చెప్పారు. ఈ నెల 29న కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా ఆధ్వర్యంలో బోర్డు కార్యాలయం ప్రారంభోత్సవం చేయనున్నట్టు తెలిపారు. ఈ సందర్భంగా నిర్వహించే సభకు రైతులు పార్టీలకతీతంగా పెద్దఎత్తున తరలిరావాలని పిలుపునిచ్చారు.

ఆషాఢం బోనాలు ప్రారంభం..

- బోనాలు తెలంగాణ సంస్కృతి, ఐక్యతకు ప్రతీక : స్పీకర్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

"బోనాల పండుగ తెలంగాణ సంస్కృతి, ఐక్యతకు ప్రతీక.. అమ్మవారి ఆశీర్వాదాలు రాష్ట్ర ప్రజలందరిపై ఉండాలి.. రాష్ట్రం అన్ని రంగాల్లో ముందుకెళ్లాలన్నదే ప్రభుత్వ లక్ష్యం.." అని శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ అన్నారు. ఆషాఢం బోనాల ప్రారంభం నేపథ్యంలో గురువారం గోల్కొండలోని శ్రీ జగదాంబ మహాకాళి అమ్మవారికి తొలి బోనం సమర్పించారు. స్పీకర్, మంత్రులు బోనం ఎత్తుకొని పట్టువస్త్రాలతో అమ్మవారి ఊరేగింపులో పాల్గొన్నారు. అనంతరం ఏర్పాటు చేసిన సభా కార్యక్రమంలో రవాణా బిసి సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, రాజ్యసభ సభ్యులు అనిల్ కుమార్ యాదవ్, నగర మేయర్ గద్వాల్ విజయలక్ష్మి, ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్‌తో కలిసి స్పీకర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్పీకర్ మాట్లాడుతూ.. గోల్కొండ జగదాంబ అమ్మవారి అనుగ్రహం మనపై ఉండాలని, కొన్నేళ్ల నుంచి జంట నగరాల్లో వైభవంగా బోనాల సంప్రదాయం కొనసాగుతోందన్నారు. జంట నగరాల్లో నిర్వహించే బోనాల నిర్వహణకు రూ.20 కోట్లు సిఎం రేవంత్‌రెడ్డి ముందుగానే విడుదల చేశారని తెలిపారు.

మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ.. గోల్కొండ బోనాలకు ఎంతో ప్రాముఖ్యత, చరిత్ర ఉందన్నారు. జంట నగరాల్లో దారులన్నీ గోల్కొండ వైపే ఉన్నాయని, ప్రజలు తండోపతండాలుగా వస్తున్నారన్నారు.

మంత్రి కొండా సురేఖ మాట్లాడుతూ.. నెలరోజుల పాటు జరిగే బోనాల ఉత్సవాల్లో ఎక్కడా ఎలాంటి సంఘటనలూ జరగకుండా పటిష్ట ఏర్పాట్లు చేశామన్నారు.


జెండా ఊపి ర్యాలీని ప్రారంభిస్తున్న మంత్రి కోమటిరెడ్డి

మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలి

- ఉపాధి కోసం సంక్షేమ పథకాలు : మంత్రి కోమటిరెడ్డి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

భవిష్యత్ బాగుండాలంటే మాదకద్రవ్యాల జోలికి వెళ్లొద్దని రోడ్లు భవనాలు సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి విద్యార్థులకు సూచించారు. నల్లగొండ జిల్లా కేంద్రంలో గురువారం జిల్లా పోలీస్ యంత్రాంగం, సంక్షేమ శాఖ సంయుక్త ఆధ్వర్యంలో చేపట్టిన మాదకద్రవ్యాల వ్యతిరేక వారోత్సవంలో భాగంగా ఎన్‌జీ కళాశాల నుంచి క్లాక్ టవర్ వరకు నిర్వహించిన ర్యాలీని ఆయన ప్రారంభించారు. అనంతరం క్లాక్ టవర్ నిర్వహించిన సభలో మంత్రి మాట్లాడుతూ.. కరోనా తర్వాత డ్రగ్స్ వాడకం పెరిగిందని, విద్యార్థులు డ్రగ్స్‌కు బానిసలుగా మారుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. తెలంగాణలో డ్రగ్స్ అన్నదే ఉండొద్దని, విద్యార్థుల కోసం స్కిల్ యూనివర్సిటీ కట్టిస్తున్నామని, ఇందులో భాగంగా నల్లగొండలో 34 కోట్లతో స్కిల్ సెంటర్ కట్టిస్తున్నామన్నారు. త్వరలోనే సీఎం స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌ను ప్రారంభిస్తామని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో మిర్యాలగూడ సబ్ కలెక్టర్ నారాయణ అమిత్, ఆదనపు ఎస్‌పి రమేష్, డిఇఒ భిక్షపతి, నల్లగొండ డిఎస్‌పి శివరాంరెడ్డి, డిడబ్ల్యుఒ కృష్ణవేణి, మార్కెట్ కమిటీ చైర్మన్ జూకూరి రమేశ్, మున్సిపల్ మాజీ చైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రెండు లక్షల ఉద్యోగాలు భర్తీ చేయాల్సిందే..

- జులై 4న నిరుద్యోగుల చలో సెక్రటరియేట్‌కు మద్దతు
- నిరుద్యోగ సమస్యను నాన్చడం...రాజకీయ అస్త్రంగా మార్చుకోవడం తగదు
- రేవంత్‌రెడ్డీ జాబ్ కేలెండర్ ఏమైంది? : జాన్‌వెస్లీ


కార్యక్రమంలో మాట్లాడుతున్న జాన్‌వెస్లీ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఎన్నికల మ్యానిఫెస్టోలో ఇచ్చిన హామీ మేరకు రేవంత్‌రెడ్డి సర్కారు రెండు లక్షల ఉద్యోగాలను వెంటనే భర్తీ చేయాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ డిమాండ్ చేశారు. జాబ్ క్యాలెండర్ ఏమైందని ప్రశ్నించారు. ఏటా రెండు కోట్ల ఉద్యోగాలిస్తామని కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం కూడా నిరుద్యోగులను మోసం చేసిందని విమర్శించారు. జులై నాలుగున తెలంగాణ నిరుద్యోగుల జెఎసి తలపెట్టిన హలో నిరుద్యోగి... చలో సెక్రటరియేట్ కార్యక్రమానికి మద్దతిస్తున్నట్టు ప్రకటించారు. గురువారం హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో నిరుద్యోగ జెఎసి ఆధ్వర్యంలో జులై 4న తలపెట్టిన చలో సెక్రటరియేట్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అధికారంలో ఉన్నప్పుడు విస్మరించడం.. ప్రతిపక్షాలుగా ఉన్నప్పుడు నిరుద్యోగుల సమస్యను అస్త్రంగా మార్చుకోవడం.. తిరిగి అధికారంలోకి రాగానే నాన్చడం... పాలక పార్టీలకు శరామామూలుగా మారిందని విమర్శించారు. పిజిలు, పిహెచ్‌డిలు చేసి ఉద్యోగాలు లేక ఆటోలు నడుపుకుంటూ...సెక్యూరిటీ గార్డులుగా పనిచేస్తున్న విద్యావంతులు సర్కారుకు కనిపించడం లేదా? కనిపించినా పట్టనట్టు ఉంటుందా? అని నిలదీశారు. రాష్ట్రంలో ఇద్దరు నిరుద్యోగులు చనిపోయారు? ఇంకెంత మంది చనిపోవాలి? ఇక్కెప్పుడు పోస్టులను భర్తీ చేస్తారు? పాలకులకు నిరుద్యోగుల పట్ల ఎందుకింత నిర్లక్ష్య ధోరణి? అని ప్రశ్నల వర్షం కురిపించారు. నిరుద్యోగుల పోరాటంపై పాలకులు తప్పుడు ప్రచారం చేయడం తగదని హితవు పలికారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం మోసం చేసింది కాబట్టే ఆ పార్టీని పక్కనబెట్టి కాంగ్రెస్‌కు నిరుద్యోగులు అండగా నిలిచారనే విషయాన్ని రేవంత్ రెడ్డి సర్కారు గుర్తించుకోవాలని సూచించారు. జులై నాలుగో తేదీ కంటే ముందే పోస్టుల భర్తీపై క్లారిటీ ఇవ్వాలని కోరారు. లేకుంటే, నిరుద్యోగుల ఉద్యమం తీవ్ర రూపం దాల్చే ప్రమాదం ఉందని, అప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం డమ్మీగా మారుతుందని హెచ్చరించారు. దేశంలోని సంపద కొందరి చేతుల్లోనే పోగుపడుతుందనీ, కేవలం ఐదు మంది చేతుల్లోనే 20 శాతం దేశ సంపద ఉందని వివరించారు. దేశంలో పర్మినెంట్ ఉద్యోగ వ్యవస్థనే ఎత్తివేసే పనిలో మోడీ సర్కారు ఉందనీ, అందులో కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ విధానాన్ని ప్రోత్సహిస్తున్నదని పలు ఉదహరణలు తెలిపారు. మరో వైపు ప్రయివేటు రంగంలో రిజర్వేషన్లు అమలు చేయాలనే డిమాండ్‌ను పెడచెవిన పెడుతున్న తీరును ఎండగట్టారు. నిరుద్యోగులు కూడా సమస్యకు మూలాన్ని అర్థం చేసుకోవాలని సూచించారు. ఒకవైపు ఉద్యోగాల భర్తీ కోసం కొట్లాడుతూనే..మరోవైపు సమాజ మార్పు కోసం తమ వంతు కృషి చేయాలని పిలుపునిచ్చారు.

పథకం ప్రకారమే సర్వేయర్ తేజేశ్వర్ హత్య

- సుఫారీ గ్యాంగ్‌తో హత్య చేయించిన భార్య, బ్యాంక్ మేనేజర్
- జోగులాంబ గద్వాల ఎస్‌పి శ్రీనివాసరావు వెల్లడి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

సర్వేయర్ తేజేశ్వర్ హత్య కేసును గద్వాల జిల్లా పోలీసులు ఛేదించారు. వివాహేతర సంబంధానికి అడ్డొస్తున్నాడని భార్య ఐశ్వర్య, ఆమె ప్రియుడు బ్యాంక్ మేనేజర్ తిరుమలరావు కలిసి సుఫారీ గ్యాంగ్‌తో తేజేశ్వర్‌ను హత్య చేయించినట్టు దర్యాప్తులో తేలింది. తిరుమలరావు సహా ఎనిమిది మంది నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్టు గద్వాల జిల్లా ఎస్‌పి టి శ్రీనివాసరావు తెలిపారు. నిందితుల నుంచి కారు, 2 కొడవళ్లు, కత్తి, రూ.1.20 లక్షలు, పది మొబైల్ ఫోన్‌లు, జిపిఎస్ ట్రాకర్‌ను స్వాధీనం చేసుకున్నామన్నారు. గద్వాల జిల్లా కేంద్రంలోని తన కార్యాలయంలో గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో కీలక విషయాలు వెల్లడించారు.

మే 18వ తేదీన బీచుపల్లి దేవస్థానంలో తేజేశ్వర్, ఐశ్వర్య వివాహం జరిగింది. వారు కొన్ని రోజులపాటు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం కర్నూల్ జిల్లాలోనే కాపురం పెట్టారు. అయితే పెళ్లికి ముందే తేజేశ్వర్‌ను అంతమొందించాలని బ్యాంక్ మేనేజర్ తిరుమలరావు పన్నాగం పన్నారు. నాలుగైదు సార్లు ప్రయత్నించి విఫలమయ్యారు. ఈ క్రమంలో ఐశ్వర్య బ్యాంక్ మేనేజర్‌తో సన్నిహితంగా ఉండడం చూసిన తేజేశ్వర్ భార్యను గద్వాలకు తీసుకొచ్చాడు.

దీంతో తేజేశ్వర్ అడ్డు తొలగించుకోవాలని వారిద్దరూ నిర్ణయించుకు న్నారు. ఆ మేరకు తేజేశ్వర్ కదలికల కోసం బైక్‌లో జిపిఎస్ పరికరం అమర్చారు. జూన్ 17న మాయమాటలు చెప్పి తేజేశ్వర్‌ను ఇంటి నుంచి తీసుకెళ్లి కారులోనే సుఫారీ గ్యాంగ్ సాయంతో హత్య చేశారు. మృతదేహాన్ని తీసుకెళ్లి నంద్యాల జిల్లా పాణ్యం వద్ద కాల్వలో పడేశారు. సెల్‌ఫోన్ కాల్స్, కారు ట్రాకింగ్ ఆధారంగా కేసును పోలీసులు ఛేదించారు. ఈ నెల 21న మృతదేహం లభ్యమైంది. అయితే, నిందితులు ఇటీవల మేఘాలయలో జరిగిన హనీమూన్ హత్య కేసు గురించి చర్చించుకున్నారు.

పోలీసులకు చిక్కకూడదనుకున్నారు. ఇద్దరూ లద్దాఖ్ వెళ్లాలని నిర్ణయించుకున్నారు. కొన్నాళ్ల తర్వాత ఐశ్వర్యను రెండో పెళ్లి చేసుకోవాలని తిరుమలరావు ప్రణాళిక వేసుకున్నాడు.

సిబ్బందిని అభినందించిన ఎస్‌పి

సంచలనం సృష్టించిన హత్య కేసును అతి తక్కువ సమయంలో ఛేదించడంలో ప్రతిభ చూపిన గద్వాల పట్టణ ఎస్ఐ కల్యాణ్ కుమార్, రూరల్ ఎస్ఐ శ్రీకాంత్, ధరూర్ ఎస్ఐ కొండా శ్రీ హరి, మల్దకల్ ఎస్ఐ నందికర్, గట్టు ఎస్ఐ మల్లేష్, ఐటి సెల్ ఎస్ఐ సుకూర్, పి ఎస్ఐలు స్వాతి, తేజేశ్విని, సిబ్బందిని క్యాష్ రివార్డుతో ప్రత్యేకంగా అభినందించారు.

51 శాతం ఫిట్‌మెంట్ ప్రకటించాలి

- త్వరలో హైదరాబాద్‌లో లక్ష మందితో ఆవిర్భావ సభ
- టిఎన్‌జిఒ అధ్యక్షులు మారం జగదీశ్వర్


సభలో మాట్లాడుతున్న జదీశ్వర్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలోని ఉద్యోగులు, ఉపాధ్యాయులకు 51 శాతం ఫిట్‌మెంట్‌ను వెంటనే ప్రకటించాలని టిఎన్‌జిఒ అధ్యక్షులు మారం జగదీశ్వర్, ప్రధాన కార్యదర్శి ముజీబ్ హుస్సేనీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. టిఎన్‌జిఒ రాష్ట్ర కార్యవర్గ సమావేశాన్ని గురువారం హైదరాబాద్‌లోని నాంపల్లిలో నిర్వహించారు. అనంతరం మీడియాతో మారం జగదీశ్వర్, ముజీబ్ మాట్లాడుతూ ఉద్యోగుల పెండింగ్ సమస్యల సాధన కోసం ప్రభుత్వంతో, మంత్రివర్గ ఉపసంఘంతో, అధికారుల కమిటీతో సుదీర్ఘంగా చర్చించామని చెప్పారు. పంచాయితీ కార్యదర్శులను గ్రేడ్‌లుగా విభజించడం, సచివాలయంలో 12.5 శాతం కోట అమలు చేయాలని కోరారు. పెండింగ్ బిల్లులకు సంబంధించిన మెడికల్ బిల్లులను మంజూరు చేయాలనీ, డీఏ ఉత్తర్వులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కొన్ని శాఖలకు అదనపు పోస్టులను మంజూరు చేయించడం వంటి 16 సమస్యలను ప్రభుత్వం పరిష్కరించిందని అన్నారు. 2023, జులై ఒకటి నుంచి పెండింగ్‌లో ఉన్న పిఆర్‌సిని అమలు చేయాలని, 51 శాతం ఫిట్‌మెంట్‌ను ప్రకటించాలని కోరారు. పెండింగ్ డిఎలను మంజూరు చేయాలనీ, పెండింగ్ బిల్లులను చెల్లించాలని సూచించారు. సిపిఎస్‌ను రద్దు చేసి ఒపిఎస్‌ను అమలు చేయాలని అన్నారు. గచ్చిబౌలి ఇండ్ల స్థలాలను బిటిఎన్‌జిఒ సొసైటీకి కేటాయించడానికి అడ్డుగా ఉన్న ప్రభుత్వ మెమోను రద్దుచేసి వెంటనే ఆ సొసైటీకి స్థలాన్ని కేటాయించాలని డిమాండ్ చేశారు. గచ్చిబౌలి రెండో ఫేస్ భూమిని టిఎన్‌జిఒ సొసైటీకి బదలాయించాలని కోరారు. ఉద్యోగుల ఆరోగ్య కార్డుల విషయంలో స్పష్టమైన విధానాన్ని ప్రకటించాలని డిమాండ్ చేశారు. త్వరలో లక్ష మంది ఉద్యోగులతో హైదరాబాద్‌లో టిఎన్‌జిఒ 80 వసంతాల ఆవిర్భావ సభను నిర్వహిస్తామని వివరించారు. టిఎన్‌జిఒ ఎప్పుడూ ప్రభుత్వంతో సఖ్యతగా ఉంటూనే పెండింగ్ సమస్యల సాధన కోసం పోరాటాల నిర్వహణలో వెనకడుగు వేయబోదని స్పష్టం చేశారు. త్వరలోనే ఉద్యోగుల అన్ని సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చొరవ తీసుకుంటుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో 33 జిల్లాల అధ్యక్ష కార్యదర్శులు, కేంద్ర కార్యవర్గ సభ్యులు, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు కస్తూరి వెంకటేశ్వర్లు, సత్యనారాయణ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

రాంకీ ఇన్‌ఫ్రాకు బహుళ అవార్డులు

ప్రజాశక్తి - హైదరాబాద్

పర్యావరణ అనుకూల మౌలిక సదుపాయాల సంస్థ రాంకీ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ లిమిటెడ్ (ఆర్ఐఎల్) రెండు ప్రతిష్టాత్మక జాతీయ, అంతర్జాతీయ అవార్డులను అందుకున్నట్లు తెలిపింది. రాంకీ వన్ ఓరియన్ మరియు రాంకీ వన్ ఆర్బిట్ రెసిడెన్షియల్ ప్రాజెక్ట్‌ల కోసం బ్రిటిష్ సేఫ్టీ కౌన్సిల్ ద్వారా అంతర్జాతీయ భద్రతా అవార్డులు 2024ను పొందినట్లు పేర్కొంది. ఈ అవార్డును బిఎస్‌సి చీఫ్ ఎగ్జిక్యూటివ్ మైక్ రాబిన్సన్ ప్రదానం చేశారని తెలిపింది.

పేద విద్యార్థులకు క్వాలిజీల్ సాయం

ప్రజాశక్తి - హైదరాబాద్

పేద పిల్లలకు విద్యను మరింతగా చేరువ చేసే ఉద్దేశ్యంతో సిఎస్ఆర్ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు ఇంజనీరింగ్, డిజిటల్ సొల్యూషన్స్ కంపెనీ క్వాలిజీల్ తెలిపింది. నిర్మాణ్ ఆర్గనైజేషన్ సహకారంతో మియాపూర్‌లోని చావడి పేద విద్యార్థుల ఆశ్రమంలో విద్యార్థులకు బ్యాక్-టు-క్లాస్‌రూమ్ కిట్‌లను పంపిణీ చేసినట్లు పేర్కొంది. పిల్లలు పాఠశాలకు ఉత్సాహంగా వెళ్ళటానికి ప్రోత్సహించే రీతిలో నోట్‌బుక్‌లు, బ్యాగులు, స్టేషనరీ వంటి అవసరమైన పాఠశాల సామాగ్రిని కిట్‌లలో అందించినట్లు వెల్లడించింది. ఈ కార్యక్రమంలో క్వాలిజీల్ ఇన్నోవేటివ్ టెక్నాలజీ సొల్యూషన్స్ వైస్ ప్రెసిడెంట్ కింబర్లీ బేకర్‌తో పాటు క్వాలిజీల్ సహ వ్యవస్థాపకురాలు కోటే బిపిల్లి పాల్గొన్నారని పేర్కొంది.



హైదరాబాద్‌లో బృహస్పతి టెక్ తయారీ ప్లాంట్

- రూ.70 కోట్ల పెట్టుబడులు

ప్రజాశక్తి - హైదరాబాద్

నగర సమీపంలో సిసిటివి తయారీ యూనిట్‌ను ఏర్పాటు చేయనున్నట్లు బృహస్పతి టెక్నాలజీస్ లిమిటెడ్ ప్రకటించింది. గురువారం హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ రాజశేఖర్ పాపోలు మాట్లాడుతూ.. పటాన్‌చెరు సమీపంలో ఈ యూనిట్‌ను రూ.60-70 కోట్ల పెట్టుబడితో 2026 మార్చి నాటికి అందుబాటులోకి తేనున్నామన్నారు. దీని ద్వారా 400 మందికి ఉపాధి లభించనుందన్నారు. ప్రతీ నెల 2.5 లక్షల యూనిట్ల తయారీ సామర్థ్యాన్ని కలిగి ఉంటుందన్నారు. ఇటీవల తమ సంస్థ విదేశీ సంస్థాగత మదుపుదారుల (ఎఫ్ఐఐలు), ఇతరుల నుంచి 10 మిలియన్ డాలర్ల (దాదాపు రూ.85 కోట్లు) పెట్టుబడిని విజయవంతంగా సమీకరించిందని వెల్లడించారు. ఈ పెట్టుబడితో కంపెనీని విస్తరించనున్నామని చెప్పారు. భారత్‌లో తయారైన ఎఐ ఆధారిత భద్రతా పరిష్కారాలను అందించాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. తమ సంస్థ గడిచిన ఆర్థిక సంవత్సరంలో రూ.204 కోట్ల రెవెన్యూ ద్వారా రూ.42 కోట్ల నికర లాభాలు సాధించిందన్నారు. ఇన్షియల్ పబ్లిక్ ఆఫర్ (ఐపిఒ)కు వచ్చే యోచనలో ఉన్నామన్నారు. ఇప్పటి వరకు దేశవ్యాప్తంగా 12 లక్షల సిసిటివి కెమెరాలను అమర్చామన్నారు.

ఈ సమావేశంలో ఆ సంస్థ డైరెక్టర్ హైమావతి, చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ మధు కుప్పని, చీఫ్ రెవెన్యూ ఆఫీసర్ సాకేత్ అడ్డెపల్లి, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ మురళి క్రిష్ణ పాల్గొన్నారు.